# మగువ మనసు

అత్తవారింట్లో అడుగుపెట్టగానే కృష్ణమూర్తిలో గర్వం ప్రవేశించింది. అంతకుముందు చేసుకొన్న తీర్మానాలు-లల్లీ పారిపోతూంటే జడ పట్టుకు లాగడం, ప్రకాశిగాడు ఇది వరకు లాగనే 'నులక మంచం వేశారూ' అనే సరికి బిస్కట్ల ఫ్లాట్లాం చేతిలో పెట్టడం-అవన్నీ అసలు జరపడానికి నామోషీ అనిపించింది. ప్రకాశిగాడే వచ్చి 'ఏమైనా ఇవ్వవూ' అనాలి. లల్లీ తనెంతసేపూ పలకరించక పోవడం చూసి వయ్యారం మొలికిస్తూ 'ఈ కాఫీ తీసుకోండి' అనాలి. అప్పుడు......

పైని బంతి ఆడుతున్న ప్రకాశం బావని చూశాడు. పలకరించడం కంటె ముఖ్యంగా అక్కయ్యతో 'నీ మొగుడొచ్చాడులే' అని ఉడికిస్తూ చెప్పడం అవసరంగా తోచి లోపలికి తుర్రు మన్నాడు.

అత్తగారు "వచ్చావా నాయనా" అని పలకరిస్తూనే-"ఒరే ప్రకాశం బావ కాళ్ళు కడుక్కోవాలి, నీళ్లు తెమ్మని అక్కయ్యతో చెప్పు"అని కేక వేసింది. ప్రకాశమే చెంబుతో నీళ్ళు తెచ్చాడు. అత్తగారు నవ్వుతూ "నువ్వు తెచ్చావేంరా" అన్నది.

"మరి అక్కయ్యేమో జడవేసుకుంటున్నానని చెప్పమంది" అన్నాడు. ఫక్కున నవ్వేశాడు కృష్ణమూర్తి. అత్తగారు కాఫీ తెస్తానంటూ నిష్క్రమించింది. కృష్ణమూర్తి బావమరిదిని దగ్గరకు లాక్కొని

"ఏంరా నిజంగా మీ అక్కయ్యేం చేస్తోందో చెప్పవూ" అన్నాడు.

"నేను చెప్పను" అన్నాడు ప్రకాశం "ఏమీ" ప్రశ్నించాడు బావ.

"చెవి నులిమేస్తానన్నది" అన్నాడు కదులుతున్న తెరవైపు చూస్తూ.

కృష్ణమూర్తి సంచిలోంచి పాకెట్ తీశాడు. ప్రకాశం చెయ్యిచాపాడు.

"మరి చెప్తానంటే" అన్నాడుబావ.

"కాఫీ కలుపుతోంది. నీకు పట్టావడానికి."-పాకెట్ అంకించుకొని మిత్రుల మధ్య 'గొప్ప' కోసం పరుగెత్తాడు ప్రకాశం.

కృష్ణమూర్తి నిలువుటద్దంముందునిల్చున్నాడు. ద్వారంలో తెరతొలగించుకొని శ్రీమతి ప్రవేశిస్తోందని అద్దంలో అర్థం చేసుకున్నాడు. అద్దం దగ్గరకొచ్చి తన వెనక నిలబడేవరకూ వెనక్కి తిరగదల్చుకోలేదు. లల్లీ కాఫీ కప్పు టేబిల్ మీద వుంచింది. నిలబడి ఇటు చూసింది. కృష్ణమూర్తి ఇటు తిరక్కముందే మెల్లగా వెనక్కి నడిచింది. గిరుక్కున కృష్ణమూర్తి వెనక్కి వచ్చాడు. లల్లీజడ అందీ అందడంలో జారిపోయింది. పారిపోతూ. "నన్ను పట్టుకోలేకపోయావ్" అన్నట్టు తిరిగి చూసింది.

"ఇలాగా" అన్నాడు హీరో.

"ఊహూ! ఇప్పుడు కాదు" అంతే! కృష్ణమూర్తికి కాఫీ సహించలేదు.

బంతి చేతిలో పట్టుకొని వచ్చిన ప్రకాశిగాడితో కబుర్లు చెప్పడానికి

## కన్నుసామి

దిగాడు. ప్రకాశం చెవిలో ఏదో చెప్పిలోపలికి పంపించాడు. అయిదు నిమిషాల్లోతిరిగి వచ్చాడు ప్రకాశం. "ఏమిటన్నది" అన్నాడు బావ. "నిన్ను మాట్లాడకుండా ఊరోమ్మన్నది. ఇప్పుడు రాదుట. మరి..."ఏదో చెవిలో చెప్పాడు. కృష్ణమూర్తిఉస్సురన్నాడు. అత్తగారు స్నానానికి లెమ్మన్నది. పెరట్లోకి స్నానానికి వెళ్తూండగా అక్కడ తడిక పక్కచలనం కనిపించింది. "ఇక్కడ సబ్బూ తువ్వాలూ ఉన్నాయి. పట్టికెళ్లి ఇవ్వరాతమ్ముడూ" అర్ధాంగి అమృత వాక్కులు వినిపించాయి. అటూయిటూచూసి కృష్ణమూర్తి-"సబ్బు తెచ్చిస్తే అరిగిపోదు లేవోయ్. ఇలారమ్మను" అన్నాడు. తడిక పక్కనుంచీ కిలకిలానవ్వు వినిపించింది. "సబ్బు ఇస్తే అరిగిపోదూ. రుద్దుకోడం మానేస్తారా" అంటూ లల్లీ మరింత పకపకా నవ్వింది.

ప్రకాశం సబ్బు తెచ్చాడు. కృష్ణమూర్తి బాల్చీలో సబ్బునీళ్లు తడికవైపు విసిరి "పెంకీ ఎక్కడికి పోతావులే" అన్నాడు.

"ఆ ఆ! ఆనీళ్లు మడివైపు పడతాయి నాయనా" అత్తగారటు వస్తూ అన్నది.

"సారీ సారీ!" అంటూ చాదడు నీళ్ళు తలపైని పోర్లించుకున్నాడు హీరో.

ఎన్నిసార్లు కబురుపంపినా 'ఇప్పుడు కాదు' అనడం, భోజనాల సమయంలో నెయ్యి వెయ్యడానికైనా లల్లీ రాక పోవడం, కృష్ణమూర్తికి చాలకోపం తెచ్చింది. భోజనాలయాక సముష్టిగానే వక్కలాకులు అందేయి. అర్ధాంగి కోరంగానే అర్ధాంగిమీద కోపంచేత గబగబ నమిలి మింగేశాడు.

తనకై 'మామూలు'గా ప్రత్యేకించబడేగదిలో అందలసవ్వడి అవుతున్నది. లాంతరు వెలుగుతూంది. గాజుల గలగల, చీర గరగర కొంచెంగావినిపిస్తున్నాయి. అత్తగారూ, మామగారూ ఇంగితజ్ఞత లేకుండా తనతో మాట్లాడేస్తున్నారు. ఏదో పనిమీద అత్తగారవతలకి వెళ్లింది కాని మామగారు మాత్రం-"పూర్వకాలంలో ఉండే గొప్పదనం గురించి, ఈ కాలంలో జరిగే ఘాతుకాలగురించీ మాట్లాడేస్తున్నారు. అత్తగారు ఏమీ మాట్లాడకుండా మళ్లావచ్చి కూర్చుంది. కృష్ణమూర్తి "హాయ్యో" అనుకొని పెద్ద ఆవులింతని ప్రకటించాడు.

నిమిషాలు మెల్లగా నడుస్తున్నాయి. "నాయనా! నీకు నిద్రవస్తే అదుగో ఆ పక్కమీద పడుకో" అన్నది అత్తగారు. కృష్ణమూర్తికి అర్థం కాలేదు.

"ఇదిగో ఇప్పుడేవస్తాను. లలితకి పక్కబట్టలు పడెయ్యాలి" అంటూ అత్తగారవతలికి వెళ్ళింది. కృష్ణమూర్తి గిరగిర వీధిలోకి ఇంట్లోకి చిరాగ్గా నడిచేశాడు. వీధిగదిలో చిన్నశబ్దం విని ఆగి దగ్గరకు వెళ్లాడు. కన్నీరాపుకోలేనిస్థితిలో లలితయేడుస్తూంది. తెల్లని వాయిల్ చీరమీద నల్లని కాటుక కన్నీరు పడుతోంది. లలిత జడలో తన కిష్టమైన మల్లెపూవులు అన్నీ తలలు వంచుకున్నాయి. కృష్ణమూర్తి నిట్టూర్చాడు. రెండునిమిషాలు ఆలోచించుకొని నవ్వుకున్నాడు. ★